క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల, పెద్ద పొర్ల గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిపను లను గురువారం డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్ పరిశీలించారు. నర్సరీలను పరిశీలించి కుంకుడు కాయల మొక్కలు, మునగ, కానుగ, గంగనేరెడు మొక్కలను పెంచాలని ఆయన వనసేవకులకు సూచించారు. పాటుకాలువ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీఏలు గోపాల్, లక్ష్మీనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



కోస్గి: సీఎం రేవంత్‌ను గురువారం పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మండల నాయకులు కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి కలిసినట్లు పలువురు నాయకులు తెలిపారు.

కార్మికులకు వైద్యపరీక్షలు



ధన్వాడ: మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం లేబర్ కార్డులు ఉన్న కార్మికులకు ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డులు ఉన్న వారికి వివిధ రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీచేసినట్లు నిర్వాహకులు నయిమొద్దిన్ తెలిపారు. మహ్మద్, హైమాద్, జాఫర్, శివ, రాకేష్ తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కోస్గి: ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గుండుమాల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బ్యూలా ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో అడ్మిషన్లతోపాటు 7- 10తరగతి వరకు మిగిలిన సీట్లకు సైతం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12నుంచి ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 7న నిర్వహిస్తున్నామన్నారు. జనరల్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.125 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

గుర్తింపు కార్డుల అందజేత



మక్తల్: మండలంలోని గుడిగండ్లలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తుంపు కార్డులను ఇఫ్టూసంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ చేతుల మీద గురువారం పంపిణీ చేశారు. ఈ మేరకు.. కార్మికులు అందరు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, అచ్చిత్ రెడ్డి, వెంకటప్ప, రఘు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బలభద్రాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకుల స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. రాఘవేందర్‌గౌడ్ నేతృత్వంలోని గ్రామ యువత గురుకుల పాఠశాలల్లో ఎంపిక కోసం అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలని హెచ్‌ఎం విష్ణుచారి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

14న ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు

నర్వ: సంక్రాంతి పండగ సంబరాలను పురస్కరించుకుని ఈ నెల 14న, లంకాల్‌లో ట్రాక్టర్ రివర్స్ గేర్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 14న ఉదయం 9:గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలుంటాయన్నారు. పోటీలో పాల్గొనే నిర్వాహకులు 9441727008, 8096513210, నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

‘ఉపాధి’ అక్రమాలపై విచారణ చేపట్టండి

- వలస కూలీలకు హాజరు వేస్తున్నట్లు ఆరోపణ
- పూర్తి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధికారులకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఉపాధి అక్రమాల్లో మక్తల్ జిల్లాలోనే నెంబర్‌వన్‌గా ఉందని విమర్శించారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వనజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. విద్యుత్‌శాఖ అధికారుల నివేదికను చదివే సమయంలో జక్లేర్ సర్పంచ్ నర్సింహులు గ్రామంలో విద్యుత్ సమస్యలు దాదాపు నెలలు తరబడి ఉన్నా.. ఇప్పటికీ పరిష్కరించడం లేదని ఆరోపించారు. అనంతరం ఉపాధి హామీ అధికారులు నివేదికను గ్రామాల్లో చేసిన పనులను వివరించారు. గ్రామంలో కూలీపనులు చేస్తున్న సమయంలో వలస వెళ్లిన వారి పేరిట హాజరు వేస్తున్నారని కాచ్‌వార్ ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాంరెడ్డి, భూత్పూర్ సర్పంచ్ కుర్వ హన్మంతు ఆరోపించారు. కేవలం కాగితాల్లోనే చెట్లు నాటారని, ఇప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. నర్సరీల్లో పనిచేస్తున్న వారికి కూలీ డబ్బులు రాలేదని వాపోయారు. ఉపాధి హామీ అధికారి విధులకు హాజరైనప్పటి నుంచి అవినీతి అధికమైందన్నారు. ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పాఠశాలల పనులు సక్రమంగా చేయడం లేదని అధికారులకు సభ్యులు తెలియజేశారు. పాఠశాలలో వంటగ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేయాని కోరారు. వివిధ గ్రామాలకు రోడ్లను వేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఐసీడీఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, వ్యవసాయం, నీటిపారుదల శాఖ, వైద్య, ఆరోగ్యం తదితర శాఖలపై చర్చించారు. ముఖ్యంగా ఉపాధి హామీలపై, పంచాయతీరాజ్ శాఖపై వాడివేడిగా చర్చ కొనసాగింది. తమ గ్రామాలకు రోడ్డు వేయాలని ఖానాపూర్ సర్పంచ్ నర్సింహులు, అంకేన్‌పల్లి సర్పంచ్ లక్ష్మయ్య, ప్రతాప్‌రెడ్డి కోరారు. ఏళ్ల తరబడి ఉన్న ఆర్‌అండ్‌ఆర్ సంగంబండకు డబ్బులు మంజూరైందన్నారు. పట్టణంలోని నాలుగు గురుకుల పాఠశాలలకు స్థలం కేటాయించాలని ఎంఈఓ వెంకటయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధుల నుంచి అన్ని గ్రామాలకు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. మొదటిసారి సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ సద్గుణ, తహసీల్దార్ సువర్ణరాజు, వైస్ ఎంపీపీ రామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు రంగప్ప, పద్మ, ఇందిరమ్మ, వ్యవసాయాధికారి మితున్ చక్రవర్తి, ఎంపీఓ రహమాత్, సీడీపీఓ సరోజని మట్ట, సర్పంచ్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

కృష్ణా: మండల కేంద్రంలోని శ్రీ క్షీరాలింగేశ్వర ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కృష్ణా, హిందుపూర్ గ్రామస్తులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల 14న సాయంత్రం స్వామివారి రథోత్సవానికి రావాలని కోరినట్లు వారు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

దామరగిద్ద: ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను స్థానిక సర్పంచ్ ఆశమ్మ సమక్షంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. రానున్న రోజుల్లో ఎన్నిక ప్రజాసంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతాయన్నారు. 60మంది లబ్దిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపీడీఓ శ్రీధర్, జెడ్పీటీసీ లావణ్య, విండో అధ్యక్షుడు ఈదప్ప, ఎంపీటీసీ బస్వరాజ్, సర్పంచ్ ఆశమ్మ, బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రఘు, ఖాజా, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

మండలంలోని కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంపై అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ విలేకరులు మాట్లాడుతు ప్రజాసేవాతో మరింత ఆదారాభిమాలను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సాయిరెడ్డి, అంజప్ప, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



కృష్ణాలో చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: యువత, విద్యార్థులు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయుడు శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని ఖాన్‌దొడ్డి పాఠశాలలో వివేకానందుడి జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో ఉపయోగపడే విధంగా ఉన్నతంగా ఎదగాలని ఇలాంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీనగర శాఖ తెలిపారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఊరిబయటి ఆంజనేయస్వామి దావాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందు బంధువులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఇంటింటికీ రాముడి అక్షతలు



నారాయణపేటలో అక్షతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం, జాజాపూర్, అప్పక్‌పల్లి, అప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాముడు ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడని, ఎన్నో సంవత్సరాల కల రామాలయ నిర్మాణం పూర్తికావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ జీవితకాలంలో అయోధ్యను సందర్శించాలన్నారు. ఈనెల 22వరకు అక్షతలను ఆలయ సన్నిధిలో ఉంచాలని, ఆ తర్వాత తలపై చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.



మరికల్‌లో అక్షతలను అందజేస్తున్న గ్రామస్తులు

మరికల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను మండలంలోని మాధవరంలో గురువారం విశ్వహిందు, భజరంగదళ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. వార్డుల వారీగా టీములను ఎంపికచేసి ఇంటింటికీ అక్షతలు చేరేలా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందు, భజరంగదళ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాగనూర్: రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంటికీ అక్షతలను పంపిణీ చేస్తున్నట్లు కొత్తపల్లి గ్రామ పెద్దలు తెలిపారు. గురువారం అక్షతలను ఊరేగింపు తీసుకెళ్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో ..

దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్దలో అయోధ్య మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం అందజేసిన అక్షతలను స్థానిక ఆంజనేయ స్వామిఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ అధ్యాపకుడు రవిందర్‌నాథ్ మాట్లాడుతూ.. అయోధ్య రాముడి ఆదర్శ పాలనతో ఉన్నత కుటుంబ వ్యవస్థకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. అనంతరం స్థానిక బీకేఎస్ జిల్లా నాయకుడు బాల్‌చందర్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు జనార్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి సమక్షంలో అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



సింగారంలో..

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మక్తల్: ఆటో, బైక్‌ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని చందపూర్ గ్రామశివారులో గురువారం చోటుచేసుకుంది. నందిమల్లకు చెందిన ఆదర్శకుమార్ (29)అనే వ్యక్తి రాయిచూర్‌కు తనసొంత పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో చందాపూర్ నుంచి జాతీయ రహదారివైపు వస్తున్న ఆటోను బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైయ్యాయి. చికిత్సనిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పర్వతాలు అక్కడికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ శివారులో గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల అలజడిని విన్న పేకాటరాయులు కొంతమంది అక్కడ నుంచి పారిపోయినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులు బోయ రాములు, తెలుగు మహదేవ, గడ్డమీది బల్‌రామ్‌తో పాటు మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు, రూ. 4800నగదు పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీటిని సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో గురువారం అమావాస్య పూజలు ఘనంగా కొనసాగాయి. రాష్ట్ర సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, శివలింగేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న సుమన్

మాగనూర్: మండలంలోని తళంకేరిలో టీబీ రోగులకు పౌష్టికాహారం మందులు సుబీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందుల, పౌష్టికాహారం పంపిణీ చేసి ఆదుకుంటున్న సుబీక్ష ఫౌండేషన్ సుమన్‌ను టీబీ వైద్యాధికారి నరేష్ ప్రత్యేకంగా అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ సుమన్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రణయ్, సూపర్‌వైజర్ చెన్నకేశవులు, ఏఎస్‌ఎం సుధా, ఆశాకార్యకర్తలు సరిత, ఆరోగ్యశ్రీ రాధిక తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌పై అవగాహన



మరికల్: సమాజంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని షీటీం ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. మండలంలోని కన్మనూర్‌లో గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు షీటీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయం తెలిసి ఉండాలని, ప్రతీ బాలిక గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 8712670398కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మద్దూర్: ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రారంభిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మీ, ఎంపీటీసీ వెంకటయ్య, సర్పంచ్ అరుణ, సీడీపీఓ రోజా తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

నారాయణపేట రూరల్: తెలంగాణ గిరిజన ఉద్యోగ సేవా సంఘం నూతన క్యాలెండర్‌ను గురువారం డీఈఓ అబ్దుల్‌ఘని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, డ్రాపౌట్స్ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ప్రయత్నించాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజునాయక్, వెంకట్‌నాయక్, ఎస్‌ఓలు శ్రీనివాస్, విద్యాసాగర్, నాగార్జున్‌రెడ్డి, టీచర్లు శ్రీకాంత్, నర్సింహారెడ్డి, జనార్ధన్ రెడ్డి, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కోస్గి: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం కోస్గి, గుండుమాల్ మండలాల నూతన క్యాలెండర్‌ను గురువారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో క్యాలెండర్‌ను మండల బాధ్యులు అంజలీదేవితోపాటు జిల్లా నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరణ నిర్వహించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఉత్తమ దేశ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని సంఘం నాయకులు ఈ సందర్భంగా సూచించారు. రమేష్, మధుసూదన్, ప్రకాష్‌గౌడ్, అనంతయ్య, నర్సింహులు, నాగరాజు, బ్రహ్మయ్య, సంతోష్, పవన్ కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

నారాయణపేట రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణం, మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గురువారం రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పండగ విశిష్ఠతతోపాటు దేశ రక్షణలో సైనికుడు, అన్నంపెట్టే రైతన్నల ప్రాముఖ్యతను తెలియజేస్తు ముగ్గులు వేశారు. వివిధ రకాలైన డిజైన్లతో చుక్కల ముగ్గులువేసి రంగులు అద్దారు. చక్కటి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి పండగ వేడుకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పండగ ఆవశ్యకతను వివరిస్తూ బాలికలు ముగ్గులువేసి అందులో గొబ్బెమ్మలతో ఆడిపాడారు. బాలురు సైతం గాలిపటాలు తయారుచేసి పండగను నిర్వహించారు. ముగ్గులు, గాలిపటాల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిద్దిరాములు, ఉపాధ్యాయులు వినోజ్, తుల్జారాం, భీమయ్య, రాజు, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేసి పతాంగులను ఎగరవేశారు. కార్యక్రమంలో తెలుగు పండిత్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మహేష్, ఉదయశ్రీ, శివశంకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థిని


మక్తల్: ముందస్తు సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలోని రేడియంట్ పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ బాల్‌రాజ్‌రెడ్డి, డైరెక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా సంక్రాంతి పండగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం మహేశ్వరి మాట్లడుతూ.. సంక్రాంతి పండగ అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి పతాంగులు ఎగరవేసి ముగ్గపోటీలు నిర్వహించారు. మూడురోజుల పాటు జరుపుకునే ఈ పండుగ చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్, సంధ్య, భారతి, ప్రియాంక, అక్షర, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.




మాగనూర్‌లో..


నర్వ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులను అందజేశారు.



నర్వలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



కోస్గిలో..



మక్తల్‌లో..

సామగ్రి అందజేత

మరికల్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలోని నిర్వహించే అన్నదానం కోసం వంట సామగ్రిని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి డోనేషన్ చేశారు. మొత్తం రూ.55వేల రూపాయల విలువగాల సామగ్రిని అందజేశారు. దీంతో అన్నదానం చేసేందుకు వేసులుబాటు అయిందని నిర్వాహకులు ఆయనను కృతజ్ఞతలు తెలిపారు.